ఆంధ్రప్రభ
December 8, 2007 Saturday

# ప్చ్.... ఒరిగేదేమి లేదు

## నోడల్ ఏజెన్సీ పై ఎస్సీ, ఎస్టీ సీనియర్ అధికారుల పెదవి విరుపు

హైదరాబాద్, డిసెంబర్ 7, దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్న ప్రభుత్వ నిధుల సక్రమ వినియోగం కోసం కొత్తగా ఏర్పాటుచేసిన నోడల్ ఏజెన్సీ ఆశించిన స్థాయిలో లేదని ఎస్సీ, ఎస్టీ ఉన్నతాధికారుల సామాజిక న్యాయవేదిక పెదవి విరిచింది. పోరాటాల ఫలితంగా రూపుదిద్దుకున్న ఈ నోడల్ ఏజెన్సీ ద్వారా దళితులకు ఒరిగేదేమి లేదని ఫోరం అభిప్రాయపడింది. ప్రతినెలా మొదటి శుక్రవారం జరిగే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఉన్నతాధికారుల సమావేశం శుక్రవారం రాత్రి హైదరాబాద్ అంబేద్కర్ భవన్ లో రాష్ట్రప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వం ఏర్పాటుచేసిన నోడల్ ఏజెన్సీకి పరిమిత అధికారులు మాత్రమే ఉన్నాయని ఫోరం పేర్కొంది. ఆయా విభాగాలలో ఎస్.సి., ఎస్.టి., స్పెషల్ కాంపోనెంట్ లో ఖర్చు కాకుండా మిగిలిపోయే నిధులను ఇతర శాఖలకు మళ్లించే వెసులుబాటును ఆయుధంగా మల్చుకుని అట్టడుగువర్గాల అభ్యున్నతికి సభ్యులంతా కృషి చేయాలని ఫోరం తీర్మానించింది. బడ్జెట్ కేటాయింపులతో దళితులకు అందవలసిన న్యాయమైన వాటా కోసం సంబంధిత శాఖలపై ఒత్తిడి పెంచేందుకు అనుభవజ్ఞులైన అధికారులతో ఒక ఉపసంఘాన్ని ఏర్పాటుచేయాలని పలువురు సభ్యులు సూచించారు. ఎస్సీ, ఎస్టీ, నోడల్ ఏజెన్సీ పనితీరుపై పర్యవేక్షణ సమగ్ర మూల్యాంకమ కోసం ఈ కమిటి కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ శాఖలలోని ఆయన విభాగాలలో రిజర్వేషన్ కింద జరిగే పదోన్నతులలో జరుగుతున్న అన్యాయాలు, కార్యాలయ సిబ్బంది పై కులం పేరుతో వివక్షను రూపుమాపేందుకు సమాచార చట్టాన్ని ఆయుధంగా చేసుకొని అవసరమైన న్యాయస్థానాలలో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసేందుకు వెనుకాడేది లేదని ఫోరం సభ్యులు హెచ్చరించారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న అరకొర వసతులపై మీడియాలో వస్తున్న కథనాలపై స్పందిస్తూ ఫోరంలోని సభ్యులంతా తరుచూ ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లు సందర్శించి ఒకరోజు అక్కడ బసచేయాలని సదస్సు తీర్మానించింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ అధ్యక్షుడు జస్టిస్ పున్నయ్య, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి గోపాలరావు, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కె.రాజు, పోలీసు ఉన్నతాధికారి మల్లెల బాబూరావు, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి అంబేద్కర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.